పారిశుధ్య కార్మికుడిని

పట్టించుకోరూ..

- ద్విచక్ర వాహనం అదుపు తప్పి తలకు తీవ్రగాయాలు
- ఆపరేషన్ కోసం ₹5లక్షలు అత్యవసరం
- దాతల సాయం కోసం కుటుంబ సభ్యుల ఎదురుచూపు

దవాఖానలో చికిత్స పొందుతున్న దుగ్గ రాజు

కోనరావుపేట, ఏప్రిల్ 15: పల్లెలో ఉదయాన్నే చెత్తబండి నడిపే పారిశుధ్య కార్మికుడికి ప్రమాదం వచ్చింది. అదుపు తప్పి ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆపరేషన్ చేయించడానికి డబ్బులు లేకపోవడంతో బాధిత కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గ రాజు గ్రామంలోనే పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొన్నేండ్ల క్రితం తండ్రి మృతిచెందడంతో రాజు పెద్దదిక్కును కోల్పోయాడు. ఈ క్రమంలో రాజు గ్రామంలోనే చెత్త బండిని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన జీతంతోనే తల్లి మల్లవ్వ, భార్య విజయ, కుమారుడు అజయ్‌ను పోషిస్తున్నాడు. ఈ క్రమంలో వారం క్రితం సిరిసిల్ల పట్టణానికి పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా, తల భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు తలభాగంలో ఆపరేషన్ చేయాలని, అందుకోసం ₹5లక్షలు అత్యవసరమని చెప్పారు. ఇప్పటికే ₹2లక్షల వరకు అప్పు చేసి చికిత్స చేయించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేదని,చికిత్స కోసం దాతలు సాయం చేయాలని అతడి భార్య వేడుకుంటున్నది.

సాయం చేయాల్సినవారు సంప్రదించాల్సిన నంబర్

పేరు: దుగ్గ మల్లవ్వ
దక్కన్ గ్రామీణ బ్యాంక్, నిజామాబాద్ బ్రాంచ్ (కోనరావుపేట మండలం)
బ్యాంక్ అకౌంట్ నంబర్: 79025278473
బ్యాంక్ ఐఎఫ్‌సీ కోడ్: SBHY0(ZER0)RRDCGB
ఫోన్‌పే, గూగుల్ పే నంబర్: 9640455357

కొనుగోళ్లలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- పలు గ్రామాల్లో సెంటర్ల పరిశీలన

సిరిసిల్ల రూరల్: కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, అంకుసాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని వసతులను పర్యవేక్షించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తర్వాత తంగళ్లపల్లిలోని సప్తగిరి ఇండస్ట్రీని తనిఖీ చేశారు. దళారులకు అడ్డుకట్ట వేసేందుకు రైతులకు మద్దతు ధర అందించేందుకు గానూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీర్నపల్లి, ఏప్రిల్15: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దా ర్ ఉమారాణి పేర్కొన్నారు. బావుసింగ్‌నాయక్‌తండా, భూక్యాతండా, మద్దిమల్లతండా, బంజేరు, బాబాయిచెరువుతండాలోని కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని, వేసవి దృష్ట్యా రైతులకు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్, ఆర్ఐ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

కోనరావుపేట, ఏప్రిల్ 15: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. ధర్మారంలో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి, మాట్లాడారు. ధాన్యం కుప్పలు కుప్పలుగా నిలిచిపోవడం తప్పా.. ప్రభుత్వం ఇప్పటి వరకు కాంటాలను ప్రారంభించలేదన్నారు. రైతులకు ధాన్యం అమ్ముకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

నిజామాబాద్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల కాంట చేస్తున్న హమాలీలు

తూకం వేశారు.. లారీ తరలించారు

నమస్తే ఎఫెక్ట్

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నప్పటికీ.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించకపోవడంతో 'నమస్తే తెలంగాణ'లో 'వడ్లు కొనేదెన్నడు' అనే ప్రత్యేక కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. నిజామాబాద్ గ్రామంలో సింగిల్ విండో పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తేమశాతం వచ్చిన వడ్లను తూకం వేశారు. వెంటనే సాయంత్రం వేళలో తూకం వేసిన బస్తాలను లారీలో రైస్ మిల్లులకు తరలించారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి ధాన్యం తూకం వేసి తరలించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

- కోనరావుపేట, ఏప్రిల్ 15

ఆకుపచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- ఇష్టారీతిన 'హరిత' చెట్లను కొట్టేస్తున్న సెస్ అధికారులు

కోరెంలో రహదారి పక్కన ఆకుపచ్చని చెట్లను కొట్టివేసిన సెస్ అధికారులు

హరితహారంలో భాగంగా గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి వాహనదారులతోపాటు గ్రామస్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే కోరెం సబ్‌స్టేషన్ నుంచి బూర్గుపల్లి గ్రానైట్ కంపెనీకి కొత్తగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభాలు వేసి తీగలు లాగుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సెస్ అధికారులు ఇష్టానుసారంగా ఆకుపచ్చని చెట్లను కొట్టేశారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు పంట చేనుల్లోంచి వేస్తున్నారని కోరెం గ్రామానికి చెందిన రైతు క్యాతం తిరుపతిరెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా, సోమవారం అధికారులు పరిశీలించారు. పచ్చని చెట్లను అధికారులు ఇష్టారీతిన కొట్టేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- బోయినపల్లి, ఏప్రిల్ 15

అదుపు తప్పి..

డివైడర్‌ను ఢీకొట్టి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- వేములవాడలో విషాదం

వేములవాడ, ఏప్రిల్ 15: ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన వేములవాడ పట్టణంలోని సాయిరక్ష దాబా సమీపంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ చెందిన ఎండీ షారుఖ్(26) శాత్రాజ్‌పల్లికి వెళ్లి ఆదివారం రాత్రి వేములవాడలోని తన ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో సాయిరక్ష దాబా సమీపంలో రహదారి మరమ్మతు పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని షారుఖ్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, షారుఖ్‌కు భార్య, కూతురు (11నెలలు) ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సెలవుల్లోనే పనులు పూర్తి కావాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడ పరిధిలో ₹ కోటి29లక్షలతో అంచనాలు

తిప్పాపూర్ పాఠశాలలో వసతులను పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఏప్రిల్ 15: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద సర్కారు బడుల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, అభివృద్ధి పనులన్నింటినీ వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు. వేములవాడ మండల పరిధిలో 20పాఠశాలలను గుర్తించగా, కోటి 29లక్షల రూపాయల అంచనాలతో మౌలిక వసతులు, అభివృద్ధి పనులను రూపొందించారని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులను వేగవంతం చేసి, వేసవిలోనే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీఈవో రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, డీఈ తిరుపతి, ఏఈ నరసింహస్వామి, హెచ్ఎం తిరుపతి, తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉంటూ సేవలందించాలి

- ప్రజా సమస్యలపై దృష్టిసారించాలి
- ఎంపీపీ వంగ కరుణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వంగ కరుణ

గంభీరావుపేట, ఏప్రిల్ 15: నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ వంగ కరుణ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ హాజరయ్యారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయని, లింగన్నపేట మానేరు వాగుపై వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి కోరారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సముద్రాలింగాపూర్ ఎంపీటీసీ పరశురాములు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేసేలా అధికారులు చొరవ చూపాలని నాగంపేట ఎంపీటీసీ నాగభూషణం తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి పంపిణీపై ప్రత్యేకాధికారులు దృష్టిసారించాలని ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, వైస్ ఎంపీపీ దోసల లత, ఎంపీవో రాజశేఖర్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏవో వెంకటేశ్, పీఆర్ ఏఈ సాయి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రియ, పశు వైద్యాధికారి శ్రావణ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని పద్మనగర్‌లో మేర సామాజికవర్గానికి చెందిన తెంబరవేని లావణ్య ఇటీవల మృతిచెందగా, జిల్లా మేర సంఘం అధ్యక్షుడు ఓదెల శ్రీనివాస్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ₹10వేల ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ రామగిరి చంద్రయ్య, దీకొండ లక్ష్మణ్, స్వామి, రామగిరి శ్రీనివాస్, టీ శ్రీనివాస్, రామగిరి దిలీప్, శేషగిరి, రమేశ్, పెండ్యాల భిక్షపతి, గణేశ్, వేణు, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తూ చెట్లు దగ్ధం

కోనరావుపేట, ఏప్రిల్ 15: కనగర్తిలో దళితులకు ఇచ్చిన భూమి సమీపంలో ఉప్పుల రాజుకు చెందిన 50చింత చెట్లు ప్రమాదవశాత్తూ కాలిపోయాయి. మంటలు ఎగిసిపడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వేములవాడ ఫైర్ సిబ్బందికి రైతులు సమాచారం అందించగా, సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కల్యాణం.. కమనీయం

వేములవాడ రూరల్/సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌లో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణమహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఎంపీటీసీ రంగు వెంకటేశ్, నాయకుడు వకుళాభరణం శ్రీనివాస్, ముదిరాజ్ కులస్తులు ఉన్నారు. అలాగే తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని పెద్దమ ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

21న జిల్లా కాపు సంఘ అధ్యక్షుడి ఎన్నిక

సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 15: మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నికను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అధ్యక్షుడి పదవీకాలం రెండేండ్లు ఉంటుందని చెప్పారు. వేములవాడ మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రంలో ఎన్నికలకు సంబంధించి ఉదయం 8నుంచి 9గంటల వరకు నామినేషన్లు, 10 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 11నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మూడు గంటలకు ఓట్లను లెక్కించి అధ్యక్షుడిని ప్రకటిస్తామని చెప్పారు. అగ్గి రాములు, పడిగెల రాజు, తడకల దేవరాజు, కూరగాయల మల్లేశం, నామాల పోశెట్టి ,ఇప్పపూల లక్ష్మణ్ ఎన్నిక నిర్వహణకు హడ్‌హక్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

విద్యుత్ పరికరాలు అందజేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15: పెద్దలింగాపూర్‌లోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్‌ను సంప్రదించారు. ఈ మేరకు ఆయన వెంటనే స్పందించి దాదాపు రూ.5వేల విలువైన విద్యుత్ పరికరాలను సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి అందజేశారు. మాజీ సర్పంచ్‌ను పలువురు అభినందించారు.

పెండింగ్ వేతనాలు అందించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 15: గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే అందించాలని అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్‌ను సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను సీఐటీయూ నాయకులుఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి పెండింగ్ వేతనాలను అందించి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.

నేటి నుంచి శ్రీరామనవమి

బ్రహ్మోత్సవాలు

కోనరావుపేట, ఏప్రిల్ 15: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17న రాములవారి కల్యాణం, 24న రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ఈవో బాలు తెలిపారు. శ్రీరామనవమి ఏర్పాట్లను తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు పరిశీలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్16: పదిరకు చెందిన కుంబాల మహేందర్‌రెడ్డి కొన్నేండ్లుగా బతుకుదెరువు కోసం దుబాయ్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో అతడి భార్య కుంబాల సుచిత్ర ఇటీవలే భర్త వద్దకు దుబాయ్ వెళ్లింది. వారి కుమారుడు కరీంనగర్‌లో చదువుకుంటుండగా, ఇంటికి తాళం వేసి గేటు లోపల స్కూటీని ఉంచారు. ఆదివారం రాత్రి దుండగులు ఇంటి ఎదుట నిలిపిన స్కూటీని ఎత్తుకెళ్లారు. జరిగిన ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగిఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత

గాంధీచౌక్, ఏప్రిల్15: ప్రతిఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ తోడ్పాటు అందించారన్నారు. రాజ్యాంగంలోని హక్కులు, చట్టాలు, విధులను అందరూ తెలుసుకోవాలన్నారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సృజన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటి, లోక్ అదాలత్ సభ్యుడు భాస్కర్, న్యాయవాదులు సుజీవన్, వేణు, విష్ణు, తిరుపతి, శంకర్, అన్సారీ, సుధీర్, ప్రశాంత్, రాజయ్య, ప్రసాద్, సుహాసిని, ఐశ్వర్య, అలేఖ్య, సుమ ఉన్నారు.

మూడపల్లిలో నిరుపయోగంగా ఉన్న చెత్తను సేకరించే బండ్లు

చెత్తలో బండ్లు

స్వచ్ఛభారత్‌లో ఇంటింటా చెత్తను సేకరించేందుకు చెత్త బండ్లను వాడేవారు. వాటి స్థానంలో ట్రాక్టర్లను చేర్చడంతో చెత్త బండ్లను మూలన పడేశారు. వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన చెత్త బండ్లను ఇలా నిరుపయోగంగా మార్చడం విమర్శలకు తావిస్తున్నది. మూడపల్లి గ్రామంలో కనిపించిన దృశ్యమిది.

- చందుర్తి, ఏప్రిల్ 15

ధర్మారం హాస్టల్ సందర్శన

కోనరావుపేట, ఏప్రిల్ 15: ధర్మారం ఎస్సీ బాలుర వసతిగృహన్ని ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మి సందర్శించారు. కూలిన హాస్టల్ ప్రహరీని పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే నాగారంలో అంబేద్కర్ ఓవర్‌సిస్ విద్యానిధి స్కాలర్‌షిప్‌కు మ్యాకల రమ్య ఎంపిక కాగా, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఇక్కడ హాస్టల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

- సిరిసిల్ల ఆర్డీవో రమేశ్
- పెద్దూరు శివారులో ప్రభుత్వ భూముల పరిశీలన

పెద్దూరులో శివారులో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేశ్, అధికారులు, రైతులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 15: పెద్దూరులో మెడికల్ కళాశాల, కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలకు భూములు అందించిన రైతులకు న్యాయం చేస్తామని సిరిసిల్ల ఆర్డీవో రమేశ్ భరోసానిచ్చారు. పెద్దూరులో ప్రభుత్వ భూములను బాధిత రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. మెడికల్ కళాశాలలో 36ఎకరాలు, కేజీబీవీ పాఠశాలకు రెండెకరాల భూములను రైతులు అందించారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో రైతులకు మరోచోట భూములు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ సంతోష్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, రెడ్యానాయక్, ఎరవెల్లి వెంకటరమణారావు, పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్‌యాదవ్, రైతులు, తదితరులు ఉన్నారు.

పోటెత్తిన భక్తజనం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 15: శ్రీరామనవమి నవరాత్రోత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు రూ.22లక్షల ఆదాయం సమకూరగా, స్వామివారిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు.

అశ్వ వాహనంపై స్వామివారు

శ్రీరామనవమి నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగారు. రాత్రి 7 గంటలకు ఆలయ అనుబంధ దేవాలయమైన సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో పంచోపనిషత్తుల ద్వారా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాత్రి 8 గంటలకు స్వామివారిని అశ్వ వాహనంపై పురవీధులగుండా ఊరేగించారు. పట్టణ ప్రజలు మంగళహారతులతో స్వామివారిని కొలిచారు. ఇక్కడ అర్చకులు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, ఇన్‌స్పెక్టర్ అశోక్, తదితరులు ఉన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వేములవాడ అగ్నిమాపకశాఖ అధికారి కమలాకర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కోరుట్ల, తిప్పాపూర్ బస్టాండ్లలో ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ముంబై ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదాన్ని అగ్నిమాపక దినోత్సవంగా జరుపుతూ ప్రమాదాల్లో కోల్పోయిన వారికి నివాళులర్పిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా వారంపాటు నిరంతరం ప్రజలు ఉండే షాపింగ్‌మాల్, అపార్ట్‌మెంట్లు బహిరంగ ప్రదేశాలు, దవాఖానల్లో ప్రమాదాలపై నివారణ అవగాహన కల్పిస్తామని చెప్పారు. వేసవిలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ అగ్నిమాపక సిబ్బంది రాజేంద్రప్రసాద్, మునీంద్రాచారి, సురేశ్, యాదయ్య, శంకర్, రాజేశం, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

శాశ్వత అన్నదాన నిధికి విరాళం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 15: మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ శాశ్వత అన్నదాన నిధికి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దేవరాజు ఉమ ₹50వేలు ట్రస్ట్ నిర్వాహకుడు మధు మహేశ్‌కు సోమవారం అందజేశారు. మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారని, ఇందుకు గాను తన సతీమణి ఉమ పేరిట నగదు అందించానని బాలచందర్ తెలిపారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్15: మున్సిపల్‌లో కాంటాక్టు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య, ఇతర విభాగాల్లో పని చేస్తూ సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బందికి ఆరు నెలల పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు మున్సిపల్ కమిషనర్ లావణ్యను కోరారు. ఈ మేరకు సోమవారం వారు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల బకాయిలు, పీఎఫ్, ఇతర పెండింగ్ సమస్యలను వారంలోగా పరిష్కరించాలని, లేకుంటే నిరవధిక సమ్మె చేస్తామన్నారు. ఇక్కడ శంకర్, రాజయ్య, బాలయ్య, నరేశ్, ఉన్నారు.

నిరుపేద యువతి వివాహానికి సాయం

రుద్రంగి, ఏప్రిల్15: మండల కేంద్రంలో నిరుపేద యువతి ఏల్లా ప్రమీల వివాహానికి ఎంపీపీ గంగం స్వరూపరాణి–మహేశ్ దంపతులు సోమవారం రూ.5వేల నగదు, నూతన పట్టు వస్త్రాలు అందజేశారు. ఇక్కడ నాయకులు గంగం మహేశ్, దయ్యాల నారాయణ, గణేశ్, శ్యామ్, విశాల్, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All
CHANGE OF NAME
★I, MUJTABA AWARIS, R/o. 3-5-119, Osmanpura, Karimnagar, TS, Have changed my name as MUJTABA AWAIS, S/o. KHAJA KHUTUBUDDIN
NT-328856

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194